క్లుప్తంగా

కొత్త వెంకోజీపాలెంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, మున్సిపాల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువజన కేంద్రం సందర్శన



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న విజయరావు

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులోని జిల్లా నెహ్రూ యువజన కేంద్రాన్ని రాష్ట్ర డైరెక్టర్ ఎ.ఆర్.విజయరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె యువత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఇందులో భాగంగా నేషనల్ వాటర్ మిషన్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీవో పోటీల్లో విద్యార్థినికి గోల్డ్‌మెడల్



విద్యార్థినికి గోల్డ్ మెడల్ అందిస్తున్న ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్ లభించింది. ఇటీవల చెన్నైలో భారత పరిశోధన సంస్థ డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జరిగిన క్విజ్ పోటీలో కళాశాల బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సీహెచ్.జ్యోతి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు.. జ్యోతికి పతకం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారిని ఉష, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సోలార్ సిస్టంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు సోలార్ సిస్టంపై అవగాహన కల్పించారు. నిపుణులైన అధ్యాపకులు గ్రహాల పనితీరు, వాటి వరుస క్రమం, గురుత్వాకర్షణ వంటి అంశాలను వివరించారు. సోలార్ సిస్టంలో సూర్యుడి పాత్రను తెలియజేశారు. ఆయా గ్రహాలు భూమి నుంచి ఎంత దూరంలో ఉన్నాయి, వాటి సహజ గుణం ఏంటనే విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మెడిటేషన్‌పై కూడా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ మహిళల చిత్రాలు



మత్స్యకారుల జీవనానికి ప్రత్యక్ష రూపం



శిల్పాలను ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు


మనసును కదిలించే భావ చిత్రాలు

- కళాత్మక ఆలోచనలకు ప్రతిరూపాలు
- ప్రశంసలు అందుకుంటున్న ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థులు

ఏయూ క్యాంపస్: సమాజాన్ని నిత్యం దర్శిస్తారు. నూతన కోణంలో మనుషుల జీవణాన్ని అన్వేషిస్తారు. మస్తిష్కంలో ఉద్భవించిన నవ్య ఆలోచనలు కాన్వాస్‌పై కుమ్మరిస్తారు. వీటికి వైవిధ్యమైన వర్ణాలను అద్ది కుడ్య చిత్రాలుగా తీర్చిదిద్దుతారు. కర్రముక్క, సబ్బుబిళ్ల, అగ్గిపెట్టె కాదేదీ కళకు అనర్హం అన్న మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టుగా ఏయూ విద్యార్థులు తీర్చిదిద్దిన కళాఖండాలు వారి ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శన విశాఖ ప్రజల, కళాభిమానుల ప్రశంసలు అందుకుంటోంది.

ప్రతిభకు దర్పణం : ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగంలో నాలుగు సంవత్సరాల బీఎఫ్ఏ, రెండు సంవత్సరాల ఎంఎఫ్ఏ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఆయా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు తీర్చిదిద్దిన శిల్పాలు, పెయింటింగ్స్‌తో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఈ సంవత్సరం విద్యార్థుల వార్షిక కళా ప్రదర్శనను ఇన్ఫినిటి పేరుతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. విభాగంలో నేర్చుకున్న నీలివర్ణ, తైలవర్ణ, యాక్రిలిక్ పెయింటింగ్‌లు, శిల్పాలు, మోడ్రన్ ఆర్ట్, థీమ్ బేస్డ్ ఆర్ట్ రూపాలను ప్రదర్శిస్తున్నారు. ప్రతి విద్యార్థి ఒక ప్రత్యేక అంశాన్ని ఆధారంగా చేసుకుని చిత్రాలు, శిల్పాలు తీర్చిదిద్దారు. కొంత మంది ప్రకృతిని, మరికొందరు సంస్కృతిని ఆధారంగా చేసుకుని చిత్రాలు గీశారు. నిగూఢ భావాన్ని కలిగిన ఎన్నో చిత్రాలు సందర్శకుల మనసులను కట్టిపడేస్తున్నాయి.

కొనుగోలుకు ఆసక్తి : ఇక్కడ ప్రదర్శనలో ఉంచిన పలు కళారూపాలను కొనుగోలు చేయడానికి సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు తీర్చిదిద్దిన పలు కళాఖండాలను కొందరు కళాప్రియులు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు కొనుగోలు చేశారు. వీటిని హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి వంటి మహానగరాలలో ఏర్పాటు చేసే ప్రదర్శనల్లో ఉంచి, విక్రయించనున్నారు. అగ్గిపెట్టులే కాన్వాస్‌గా మార్చుకుని చేసిన కళారూపం, సిగరెట్ అలవాటు మనిషి ప్రాణం తీస్తుందని చెప్పే మరో ఆధునిక కళాఖండం, మానవ సృష్టిని చూపించే శిల్పాలు, వ్యర్థాలకు అర్థం కల్పిస్తూ తీర్చిదిద్దిన కళా రూపాలు ఇక్కడ విద్యార్థుల ప్రతిభకు, ఆలోచనలకు మచ్చుతునకలు.



కర్ణాటక రాష్ట్ర సంస్కృతి, మైసూర్ ప్యాలస్‌లను ప్రతిబింబిస్తూ..



ఆలయి కళ



కొమ్ముదాసరికి జీవన చిత్రం

విభిన్న మాధ్యమాలను వినియోగించి..



బ్రాంజ్ కాస్టింగ్, సిరామిక్ క్లే వంటి విభిన్న పదార్థాలను ఉపయోగించి ప్రదర్శనలో పలు కళారూపాలను తీర్చిదిద్దాం. బైపీసీ చదివిన తరువాత ఈ రంగంపై ఆసక్తితో కోర్సులో చేరాను. మేము నేర్చుకున్న అంశాలను నేడు ప్రదర్శించే అవకాశం లభించింది.

– ఎం.ప్రశాంత్, బీఎఫ్ఏ విద్యార్థి

రాష్ట్రాల సంస్కృతులు ఆధారంగా..



దేశంలోని విభిన్న రాష్ట్రాల్లో భిన్న సంస్కృతులు మనకు దర్శనమిస్తాయి. వీటిని ఆధారంగా చేసుకుని చిత్రాలు తీర్చిదిద్దాం. నా చిత్రాల్లో రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయ నృత్యాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

– సిహెచ్.దేవి, బీఎఫ్ఏ విద్యార్థి

గ్రామీణ వాతావరణం ప్రతిబింబిస్తూ..



గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన నేను గ్రామాలలో జరిగే వేడుకలు, సంప్రదాయాలు ఆధారంగా చిత్రాలు రూపొందించాను. పెళ్లి వేడుకలో మహిళలు కలసి పనిచేయడం, కొమ్ముదాసరి చిత్రాలు ఇక్కడ ప్రదర్శించాను. వీటిలో వినియోగించిన ఆరంజ్ కలర్ ఎనర్జీకి, బ్లూ కలర్ సెలబ్రేషన్‌కి ప్రతిబింబిస్తాయి.

– కె.మోహనరావు, బీఎఫ్ఏ విద్యార్థి

ఆలయాల శిల్ప సౌందర్యం చూపించాను..



భారతదేశం పేరు చెప్పగానే ఆలయాలు శిల్ప సౌందర్యం గుర్తుకు వస్తాయి. దీనిని ఆధారంగా చేసుకుని విభిన్న ప్రముఖ దేవాలయాల శిల్ప సౌందర్యాన్ని ప్రతిబింబిస్తూ చిత్రాలు తీర్చిదిద్దాను. కేవలం అగ్గిపెట్టె డొక్కులు తీసుకుని వాటిపై పురాతన కిటికీలను నిర్మించి ఒక కళారూపం తయారు చేశాను.

– సిహెచ్.దీప్తిశ్రీ, ఎంఎఫ్ఏ విద్యార్థిని

బాలుర గృహానికి 'ఆసరా' వితరణ



బాలుర గృహం అధికారులకు జ్యూట్ బ్యాగులు కుట్టే యంత్రాలు అందిస్తున్న ఆసరా సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ: చినగదిలి దరి దీన్‌దయాల్‌పురంలో ఉన్న ప్రభుత్వ బాలుర గృహానికి ఆసరా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జ్యూట్ బ్యాగులు తయారు చేసే యంత్రాలు అందజేశారు. ఇక్కడ 14 ఏళ్ల నిండిన 20 మంది బాలురకు ఇటీవల జన శిక్షణ సంస్థ జ్యూట్ బ్యాగులు తయారీలో శిక్షణ ఇచ్చింది. ఈ విషయం తెలుసుకొన్న పీఎం పాలెంలో నిర్వహిస్తున్న ఆసరా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇక్కడ బాలురకు మరింత నైపుణ్యంతో బ్యాగులు తయారు చేయడానికి యంత్రాలు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ అధ్యక్షుడు రామారావు, సభ్యులు సూర్యనారాయణ, రాఘవ రెండు యంత్రాలను గృహం సూపరింటెండెంట్ వీరయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ వృద్ధాశ్రమం కూడా నిర్వహిస్తున్నామని, ఎటువంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా సేవలు అందిస్తున్నామన్నారు. నిరాశ్రయులైన వృద్ధులు పీఎంపాలెంలో ఆసరా సంస్థ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో చేరవచ్చన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులకు గృహం సూపరింటెండెంట్ వీరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలకు ఉచిత గుండె స్క్రీనింగ్ పరీక్షలు

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని రెయింబో ఆస్పత్రిలో పిల్లలకు ఉచితంగా గుండె స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్టు ఆస్పత్రి నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలకు ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేస్తామని పిల్లల గుండె వైద్య నిపుణుడు డాక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 91000 93117 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'శ్రీదశ మహా విద్యా వైభవం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామనరసింహం, తదితరులు

ఎంవీపీ కాలనీ: రచయిత్రి మంథా సత్యప్రభ గోపాలకృష్ణ రచించిన 'శ్రీదశమహా విద్యా వైభవం'ఈ–గ్రంథాన్ని ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం డాక్టర్ వెంపటి రామనరసింహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీదశమహా విద్యా వైభవం ఆదిపరాశక్తి తాంత్రిక రూపాలను వివరిస్తుందన్నారు. రచయిత్రి సత్యప్రభ మాట్లాడుతూ పాఠకులను ఆకట్టుకునేలా ఈ–గ్రంథాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథా గోపాలకృష్ణ, వరభభట్ల శ్రీరామమూర్తి, వరహాభట్ల భగవతి, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీ కొట్టిన లారీ

- లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు



లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్ చంబూరాజ్ బహర్

సబ్బవరం: అనకాపల్లి– ఆనందపురం జాతీయ రహదారిలో ఇరువాడ వద్ద సోమవారం రెండు వాహనాలు ఢీ కొట్టుకున్న ఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు దరి చేబ్రోలులో ఓ హేచరీ నుంచి చేపల లోడుతో లారీ ఆదివారం 11 గంటలకు కోల్‌కతా బయలుదేరింది. సోమవారం ఉదయం ఇరువాడ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న వాటర్ ట్యాంకర్‌ను చేపల లోడు లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కు పోయాడు. పోలీసులు క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీయించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయినట్లు సబ్బవరం హెచ్‌సీ సత్యనారాయణ చెప్పారు. క్షతగాత్రుడిని 108 లో అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట : ఢిల్లీలో మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యూ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నిరసనకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ, నేటి వరకు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు

- వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- పేర్ల నమోదుకు ఆహ్వానం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి కళాశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, లంకా వెంకట సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగిన దృష్ట్యా వ్యక్తిత్వ వికాసం ప్రాధాన్యం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులు తడబాటు లేకుండా తమ భావాలను వ్యక్తపరచడంతోపాటు జీవన నైపుణ్యాల అభివృద్ధి, కెరీర్ ప్లానింగ్ వంటి అంశాలపై నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ఆవరణలో నాలుగు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తమ పేర్లను వాకర్స్ పార్కులోని కార్యాలయంలో నేరుగా లేదా 94901 84360, 83091 57522, 94404 01874 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు పైడితల్లమ్మ అనుపు ఉత్సవం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం గ్రామ ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి ప్రతిమ అనుపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తు లు మొక్కులు చెల్లించుకోవచ్చని చెప్పారు. సాయంత్రం 6.30 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అనుపు కార్యక్రమం ఉంటుందన్నారు.

మృతురాలి కుటుంబానికి సాయం

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో పౌరాణం సేవలు అందించే రమా ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులకు స్థానికులు అండగా నిలిచారు. రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ యువజన సంఘం సభ్యులు రూ. 31,400 ఆర్థిక సహాయం చేశారు.

జోయల్ జోష్‌కు కరాటేలో బ్లాక్ బెల్ట్

ఎంవీపీ కాలనీ: కరాటేలో ఎంవీపీ కాలనీకి చెందిన విద్యార్థి డి.జోయల్‌జోష్ బ్లాక్ బెల్ట్ సాధించాడు. పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14న బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జోయల్ జోష్ చిన్న వయసులోనే బ్లాక్ బెల్ట్ సాధించాడు. ఈ సందర్భంగా సంస్థ అధినేతలు నరసింహారావు, శివరామకృష్ణ.. జోయల్ జోష్‌కు సోమవారం జరిగిన కార్యక్రమంలో ధ్రువపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం జోయల్ జోష్ నగరంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ పద్మారెడ్డి, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 అర్జీలు అందాయి. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్యామ్‌ప్రసాద్ అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్‌కుమార్, ఆర్ఐ రవికృష్ణ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

మానవత డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: మానవత స్వచ్ఛంద సంస్థ వార్షిక డైరీని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో తీర్చిదిద్దిన ఈ డైరీని ఆవిష్కరించి చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావుకు బహూకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు ఆచార్య కె.పరమేశ్వరరావు, ఆచార్య బి.సుధాకర రెడ్డి, ఆచార్య టి.వి.కృష్ణ, డాక్టర్ కె.రాజశేఖర్, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్ పాల్గొన్నారు.

న్యాయ శాస్త్రంలో తనూజకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థిని గుడ్ల తనూజకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. కళాశాల ఆచార్యులు నిర్మల, సీతామాణిక్యంల సంయుక్త పర్యవేక్షణలో 'ప్రొటెక్షన్ ఆఫ్ విమెన్ అండ్ చిల్డ్రన్ ఫ్రం సైబర్ క్రైమ్స్ ఇన్ ఏ క్రిటికల్ లీగల్ స్టడీ'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా తనూజను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించా రు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షుడు జి.ఎం.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో రంగుముద్రికి..: ఆంగ్ల విభాగం పరిశోధక విద్యార్థి, రంగుముద్రి విద్యాసంస్థల చైర్మన్ రంగుముద్రి గణపతిరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. విభాగ ఆచార్యులు పి.రాజేంద్ర కర్మార్కర్ పర్యవేక్షణలో 'రిలయిజం ఇన్‌సెలక్టెడ్ నవల్స్ బై కుష్వంత్ సింఘ్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

ఎంఎల్ఆర్ విభాగంలో ఆత్మీయ సమ్మేళనం



విభాగ ఆచార్యులతో పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో మిలీనియం బ్యాచ్(2000–2002) పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఇక్కడ చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పలువురు కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విభాగ ప్రగతిని ప్రత్యక్షంగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. విభాగ అభివృద్ధికి, ప్రస్తుత తరం విద్యార్థులకు ఉపాధి కల్పన, మార్గదర్శకం అందించడానికి తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు రమణమూర్తి, కె.రమేష్‌బాబు, ఏడుకొండలరావు, అధ్యాపకులు గణేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులను సత్కరించారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి నిర్వహించారు. ముందుగా విభాగం వద్దనున్న కాటన్ విగ్రహానికి పూలమాల వేసి ఆచార్యులు నివాళులర్పించారు. అనంతరం 'ట్రెండింగ్ ప్రాక్టీసెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్'అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. సదస్సును విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య వజీర్ మహ్మద్, సాంకేతిక, పరిశ్రమల నిపుణులు బ్రహ్మాజీరావు, బోయిన, ఆచార్య జి.మురళీకృష్ణ, విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

వీధి దీపాలు వెలగక అవస్థలు

ఆరిలోవ: స్థానిక బాలాజీనగర్‌లో పలుచోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదు. 147/ఏ/5/2 విద్యుత్ స్తంభంతో పాటు దీనికి సమీపంలోని మరికొన్ని స్తంభాలకు ఉండే లైట్లు సుమారు నెల రోజులకు పైగా వెలగంలేదు. బీఆర్‌టీఎస్‌లో హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, దీన్ దయాల్‌పురం మీదుగా పైనాపిల్ కాలనీ వరకు ఇదే పరిస్థితి ఉంది. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందవుతోంది. అధికారులు స్పందించి ఇక్కడ వీధి దీపాలు వెలిగించాలి.

– శ్రీనివాసరావు, బాలాజీనగర్



బాలాజీనగర్‌లో లైటు వెలగని విద్యుత్ స్తంభం →